సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023




మృత్యువుకు స్వాగతం
కేన్సర్ కబళిస్తోందని తెలిసినా మనోనిబ్బరం కోల్పోని ఖమ్మం వాసి తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. 8లో



దైవదర్శనానికి వెళ్లొస్తుండగా..
దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా రహదారిపై గేదెను ఢీకొట్టి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
39° / 23°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత ఎక్కువగానే నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ మొదలై ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

బార్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: ఇటీవల గెలుపొందిన ఖమ్మం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ బాధ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. బార్ అసోసియేషన్ హాల్‌లో అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు ఇతర కార్యవర్గంతో ఎన్నికల అధికారి ఎస్.సోమశేఖరశర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, ఉపాధ్యక్షుడిగా మాదిరాజు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మన్నేపల్లి బసవయ్య, సంయుక్త కార్యదర్శిగా అయ్యదేవర విజయ రాఘవ, గ్రంథాలయ కార్యదర్శిగా గాజుల అమర్‌నాథ్, కోశాధికారిగా మిరియాల జ్యోతి ప్రవీణ్‌కుమార్, క్రీడా కార్యదర్శిగా రావుల వెంకట్, మహిళా కార్యదర్శిగా కేవీవీ.లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఇంకా న్యాయమూర్తులు ఎస్.అమరావతి, ఆశాలత, శాంతిసోని, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు, తులసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత ఈసీ మెంబర్లుగా శీలం చెన్నారెడ్డి, ఎస్.కే.హైదర్‌అలీ, కొన చంద్రశేఖర్ గుప్తా, వల్లం అరుణ, పోరిక ఇందిర, తేలూరి వెంకటేశ్వరరావు, సింగం జనార్ధన్‌ను ఎన్నుకున్నారు.

11 నుండి సదరమ్ క్యాంపులు
ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో ఈనెల 11వ తేదీ నుంచి సదరమ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 11న మధిర మున్సిపాలిటీ, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల దివ్యాంగులకు మధిరలో, 18న సత్తుపల్లి మున్సిపాలిటీ, సత్తుపల్లి, వేంసూర్, పెనుబల్లి, కల్లూరు మండలాల దివ్యాంగులకు సత్తుపల్లిలో, 25న పాలేరు, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాల దివ్యాంగుల కోసం కూసుమంచిలో క్యాంపులు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మెడికల్ రిపోర్టులతో హాజరుకావాలని సూచించారు.

మహిళా ఎంపవర్‌మెంట్ హబ్‌లో ఉద్యోగాలు
ఖమ్మంగాంధీచౌక్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా ఎంపవర్‌మెంట్ హబ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సీహెచ్.సంధ్యారాణి తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత నిపుణులు, మల్టీ టాస్కింగ్ ఉద్యోగ నియామకాలు ఉంటాయని.. అర్హతలు, ఇతర వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10 నుంచి 22వ తేదీలోగా ఖమ్మం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారం మొదలయ్యాయి. జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా ఉదయం పరీక్షకు 270మందిలో 258మంది, మధ్యాహ్నం పరీక్షకు 270మందికి గాను 260మంది హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు. కరోనా నిబంధనలు పక్కాగా అమలుచేస్తున్న నేపథ్యాన విద్యార్థులు మాస్క్ ధరించి పరీక్షకు హాజరుకావాలని సూచించారు. కాగా, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతించారు.

చెప్పిందే ధర !



వైన్స్‌ల్లో ఎమ్మార్పీ మాటే లేదు..
- జిల్లాలో వాడవాడనా బెల్ట్‌షాపులు
- ఇక్కడ ఇష్టారాజ్యంగా ధర నిర్ణయం
- 'మామూలు'గా తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని పలు వైన్ షాపుల్లో మద్యాన్ని ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తున్నారు. మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైన్స్‌ల్లో ఈ వ్యవహారం మరింత జోరుగా సాగుతోంది. ఇక్కడ ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ఊసే ఉండడం లేదు. ఇక జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ ఓ రేంజ్‌లో ఉంది. వారు నిర్ణయించిందే ధర, వారిచ్చిందే బ్రాండ్ అన్నట్లుగా సాగుతున్నా ఎక్సైజ్ శాఖ మాత్రం నామమాత్రపు దాడులతో సరిపెడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. మద్యం షాపులు, బెల్ట్‌షాపుల నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు అందుతుండడంతోనే ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎమ్మార్పీ ఊసేది?

జిల్లాలో మొత్తం 122 వైన్ షాపులు ఉండగా.. ఇందులో అత్యధిక దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ అమలు కావడం లేదు. ఫుల్ బాటిల్‌పై ఎమ్మార్పీ ధర కన్నా రూ.20 వరకు పెంచి అమ్ముతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాకు సరిహద్దులో ఉండే సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలు, నేలకొండపల్లి తదితర మండలాల్లోని మద్యం దుకాణాల్లోనైతే అంత కన్నా ఎక్కువకే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే 'ఇష్టమైతే కొనండి.. లేకపోతే వెళ్లిపోండ'నే దురుసు సమాధానం వస్తుండడంతో పలుమార్లు వైన్ షాపుల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంటోంది.

పగ్గాల్లేని 'బెల్ట్' దందా

జిల్లాలో 'బెల్ట్' దందాకు పట్టపగ్గాల్లేకుండా సాగుతోంది. వైన్స్ నుంచి బెల్ట్ షాపులకు మద్యం జోరుగా సరఫరా అవుతుండడంతో వేల సంఖ్యలో బెల్ట్ షాపుల నిర్వహణ మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా నడుస్తోంది. గతంలో గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన బెల్ట్ షాపులు ఇప్పుడు మండల కేంద్రాల్లోనూ ఏర్పాటయ్యాయి. ఆయా షాపుల్లో వైన్స్‌ను తలదన్నేలా బహిరంగంగానే విక్రయాలు సాగిస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వైన్స్, బార్లు ఉన్న నగరాల్లో కూడా గల్లీల్లో బెల్ట్‌షాపుల వ్యాపారం జోరుగా సాగుతోంది. కాగా, బెల్ట్ షాపుల యజమానులు వైన్స్ నుంచి ఎమ్మార్పీకి మద్యం తీసుకొచ్చి ప్రతీ బాటిల్‌పై రూ.20మేర పెంచి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకొన్ని చోట్ల డిమాండ్‌కు అనుగుణంగా మరింత ధర వసూలు చేస్తున్నట్లు సమాచారం. వేసవిలో బెల్ట్ షాపుల్లో బీర్ల ధరలు విపరీతంగా ఉంటున్నాయి. ఉదాహరణకు లైట్ బీర్ ధర వైన్స్‌లో రూ.150 ఉంటే.. బెల్ట్ షాపుల్లో రూ.200, ఎండ పెరిగితే ధర మరింత పెరుగుతుందని తెలుస్తోంది.

ఎక్సైజ్ శాఖకు పట్టదా?

మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువకు విక్రయిస్తున్నా.. జిల్లా వ్యాప్తంగా బెల్ట్‌షాపులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. బెల్ట్ షాపుల నిర్వహణ విషయం తెలిసినా నెలవారీ మామూళ్లు అందుతుండడంతో అటువైపుగా చూడడం లేదనే చర్చ సాగుతోంది. ఎప్పుడైనా పత్రికల్లో కథనాలు వస్తేనో.. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో నామమాత్రంగా కొన్ని ప్రాంతాల్లో దాడులు నిర్వహించి.. తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి ఆపై వదిలేస్తున్నారు. దీంతో వైన్స్, బెల్ట్ నిర్వాహకులు ఏ మాత్రం తగ్గడం లేదు.

ధర తగ్గదు.. బ్రాండ్ ఉండదు
నేలకొండపల్లి మండలంలోని చెరువుమాదారం వైన్స్‌లో ప్రతీ మద్యం బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. పైగా ఇక్కడ అడిగిన బ్రాండ్ కాకుండా నిర్వాహకులకు ఎక్కువ లాభం వచ్చే మద్యాన్నే విక్రయిస్తుండగా ఇటీవల కొందరు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. దీనిపై షాపు యజమానులు సరైన సమాధానం చెప్పకపోవటంతో నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా జిల్లాలో పలు వైన్స్, బెల్ట్ దుకాణాల నిర్వాహకులు సాగిస్తున్న దందా.. ఎక్సైజ్ అధికారుల పట్టింపు లేని తనంపై ఎంత చెప్పినా తక్కువేనని అనాల్సిందే.

ఎక్కువ వసూలు చేస్తే చర్యలు
జిల్లాలోని వైన్స్‌ల్లో ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటాం. ఎక్కడా ఇలా జరగడం లేదు. ఎక్సైజ్ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఎమ్మార్పీ అమలును పరిశీలిస్తున్నాయి. ఇటీవల చెరువుమాదారం వైన్స్‌పై వచ్చిన ఫిర్యాదును విచారిస్తున్నాం.

– నాగేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 178 మందికి రూ.1.78 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేయగా.. ఇప్పటివరకు రూ.76.13 కోట్ల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఇక సీఎంఆర్ ఎఫ్ ద్వారా 184 మందికి రూ.66.89 లక్షలు విలువైన చెక్కులను అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్డీఓ రవీంద్రనాథ్, సుడా చైర్మన్ విజయ్, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోలుకుంటున్న 'పువ్వాడ'

సీపీఐ సీనియర్ నాయకుడు, తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు కోలుకుంటున్నారని మంత్రి అజయ్ కుమార్ తెలిపారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రిలో చేర్పించగా, ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. వారం రోజులుగా తన తండ్రి ఆరోగ్యంపై ఆరా తీయడమే కాక కోలుకోవాలని ప్రార్థించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గానికి 300మంది
- అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తీసుకురండి
- వీసీలో సీఎస్ శాంతికుమారి

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన బీఆర్.అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఈనెల 14న ఆవిష్కరించనుండగా, జిల్లాలో నియోజకవర్గానికి 300మందిని చొప్పున హాజరయ్యేలా ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి గురువారం ఆమె వీసీ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గానికి 300మందిని ఆరు బస్సుల్లో తరలించాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని బస్సులు ఏర్పాటుచేయాలని చెప్పారు. అలాగే, రెండో విడత గొర్రెల పంపిణీ త్వరలో మొదలుకానున్నందున సిద్ధం కావాలని సూచించారు. జిల్లా నుంచి వీసీకి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, పశుసంవర్ధక శాఖ జేడీ వేణుమనోహర్, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్డీఓ కిషన్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ కె.సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి చర్యలు

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 16,228 మందికి రెండో విడతగా గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండగా 8,908 మంది మాత్రమే వాటాధనం చెల్లించారని చెప్పారు. మిగతా వారు కూడా చెల్లించేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా లబ్ధిదారులకు ప్రకాశం, నెల్లూరు, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాల నుంచి గొర్రెలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

దారి పంచాయితీ!


నేలకొండపల్లిలో రహదారిపై బైఠాయించిన గిరిజనులు

- 33 అడుగుల రహదారి కోసం గిరిజన రైతుల పోరాటం
- రెండేళ్ల నుంచి భూమి బీడుగా మారిందంటూ ఆవేదన
- నేలకొండపల్లి నిర్బంధం.. తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ



తహసీల్దార్ కారును అడ్డగించిన గిరిజనులు

నేలకొండపల్లి: పొలాలకు వెళ్లే రహదారిని కొందరు ఆక్రమించుకోవడంతో ముప్పై మంది గిరిజన రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేక.. పొలాలు బీడు వారుతుండడంతో విసిగిపోయిన రైతులు గురువారం రహదారిని దిగ్బంధించారు. చివరకు తహసీల్దార్ హామీతో వారు ఆందోళన విరమించారు.

రెండేళ్లుగా అవస్థ

నేలకొండపల్లి మండలంలోని తిరుమలాపురంలో 30 మంది గిరిజన రైతులకు 65 ఎకరాల సాగు భూమి ఉంది. ఏళ్లుగా రైతులు పొలాలకు వెళ్లేందుకు ఉపయోగించుకుంటున్న దారిని రెండేళ్ల క్రితం కొందరు తమదేనని చెబుతూ ఫెన్సింగ్ వేశారు. దీంతో రైతులు సాగు చేసే వీలు లేక ఆర్థికంగా చితికిపోయారు. అధికారులను ఆశ్రయించినా ఫలితం లేక.. నిరసనలు తెలిపారు. చివరకు కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు సర్వే చేపట్టిన ఉద్యోగులు ఆపై చేతులు దులుపుకున్నారు. ఇక చేసేదేం రైతులు కుటుంబాలతో సహా గురువారం నేలకొండపల్లి లోని పెట్రోల్ బంక్ సెంటర్‌లో ఖమ్మం – కోదాడ రహదారిపై ఎర్రటి ఎండలో బైఠాయించారు. పాత నక్షాలో ఉన్న 33 అడుగుల రోడ్డు అప్పగించడమే కాక గ్రామ కంఠం నాలుగెకరాల భూమి, ఆంజనేయస్వామి ఆలయ భూమి 20 కుంటలను పంచాయతీకి ఇవ్వడంతో పాటు రాయికుంట చెరువుకు 30 అడుగుల దారి ఇవ్వాలనే డిమాండ్‌తో ధర్నా చేశారు. వీరికి సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మౌలానా, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అయోధ్య తదితరులు సంఘీభావం తెలిపారు. గ్రామస్తుల ధర్నాతో రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు నచ్చచెప్పినా ససేమిరా అన్నారు. ఈమేరకు తహసీల్దార్ దారా ప్రసాద్ చేరుకుని త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయినా సంతృప్తి చెందని వారు కారును అడ్డుకోవడమే కాక ఓ దశలో దాడి చేశారు. చివరకు దారి ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇచ్చి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ స్పష్టం చేయడంతో రెండు గంటల అనంతరం వారు ఆందోళన విరమించారు.

ఆరుగురికి నోటీసులు ఇస్తాం



తిరుమలాపురం దారి పంచాయితీని పరిష్కరించడంపై దృష్టి సారించాం. దారి ఆక్రమించుకున్న గిరిజనులు ఆరోపిస్తున్నట్లుగా ఆరుగురికి నోటీసులు ఇస్తాం. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సర్వే కూడా పూర్తయింది. ఇరువర్గాల వారితో చర్చించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం.

– దారా ప్రసాద్, తహసీల్దార్, నేలకొండపల్లి

బీడుగా రెండున్నర ఎకరాలు



మేం పొలాలకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేయడంతో ఇబ్బంది పడుతున్నాం. నాకు ఉన్న రెండున్నర ఎకరాలు బీడుగా మారింది. దారి సాధించుకునేందుకు చావటానికైనా సిద్ధమే. అధికారులు మాట నిలబెట్టుకోకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేసేందుకు వెనుకాడేది లేదు.

– రంజిత్, రైతు, తిరుమలాపురం

రెండేళ్ల నుంచి ఇబ్బందులు



రెండేళ్ల నుంచి పంటలు లేక పస్తులు ఉంటున్నాం. పొలాలకు వెళ్లే దారి లేక ఇబ్బంది పడుతున్నాం. ఇన్నాళ్లు ఉన్న దారి ఎందుకు మూసేశారో తెలియడం లేదు. ఈ విషయం తెలిసినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గ్రామ కంఠంతో పాటు ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలి.

– రాంబాయి, రైతు, తిరుమలాపురం

పంట నష్టంపై ముగిసిన సర్వే
ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలకు జిల్లాలో జరిగిన పంట నష్టంపై అధికారులు క్షేత్ర స్థాయిలో చేపట్టిన సర్వే గురువారంతో ముగిసింది. ఈమేరకు వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. గతనెల 17 నుంచి 20వ తేదీ వరకు కురిసిన అకాల వర్షాలతో జిల్లాలోని 19,732మంది రైతులకు చెందిన 31,038 ఎకరాల్లో మొక్కజొన్న, పెసర, ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యాన అధికారులు సర్వే చేపట్టారు. సర్వేలో తేల్చిన వివరాల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సర్వేల ఆధారంగా జిల్లాలో మొత్తంగా 18వేల నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లుగా గుర్తించారని తెలుస్తోంది. రైతుల పూర్తి వివరాలు, బ్యాంక్ అకౌంట్ నంబర్లను ఆన్‌లైన్‌లో చేసే ప్రక్రియ ఒకటి, రెండు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందని సమాచారం.

యూపీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం


రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం మామిళ్లగూడెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఎన్‌క్వాస్ బృందం పరిశీలించింది. ఒడిశాకు చెందిన ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్ ప్రశాంత్ ఆధ్వర్యాన వివిధ విభాగాల్లో సేవలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాంబాబు వారికి వైద్యసేవలపై వివరించారు. జిల్లా క్వాలిటీ మేనేజర్ ఉపేందర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంతటా అప్రమత్తం
- ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు
- కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు


పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్


ముదిగొండలోని కేంద్రంలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా రాష్ట్రంలోని పలుచోట్ల అపశృతులు చోటుచేసుకోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈమేరకు గురువారం పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలుచేయడమే కాక జిరాక్స్ సెంటర్లు మూసివేయించారు. ఇక కలెక్టర్ వీ.పీ.గౌతమ్ నాలుగు కేంద్రాలతో పాటు అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్ ఎనిమిది కేంద్రాల్లో తనిఖీ చేశారు. కాగా, గురువారం 16,847మంది విద్యార్థుల్లో 16,784మంది హాజరు కాగా 63మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నయాబజార్ హైస్కూల్, రిక్కా బజార్ హైస్కూల్, ఖాజీపుర ప్రభుత్వ హైస్కూల్, రాజేంద్రనగర్ ప్రభుత్వ హైస్కూళ్లలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్ నిర్వాహకులు, పోలీసులకు పలు సూచనలు చేశారు. కేంద్రాల్లోకి ఎవరినీ సెల్‌ఫోన్‌తో అనుమతించొద్దని, ప్రహరీలు లేనిచోట్ల భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అదనపు కలెక్టర్ తనిఖీ

ముదిగొండ: మండలంలోని ముత్తారం, ముదిగొండ, బాణాపురం జెడ్పీహెచ్‌ఎస్‌ల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ స్నేహలత తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో వసతులు, భద్రతపై ఆమె ఆరా తీశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ ఇందిరాజ్యోతి, ఎంపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

లిఫ్టు అందరికీ కాదు!
కలెక్టరేట్‌లోని మొదటి, రెండో అంతస్తులకు వెళ్లాలనుకునే వారి కోసం ఏర్పాటుచేసిన రెండు లిఫ్ట్‌లు ఉన్నా అందరూ ఉపయోగించకుండా నిబంధనలు విధించారు. కలెక్టరేట్ ప్రారంభించిన తొలినాళ్లలో లిఫ్ట్‌లను ఇష్టారాజ్యంగా ఉపయోగించడంతో ఒకటి కొద్దిరోజులకే మొరాయించింది. అయితే, అధునాతన టెక్నాలజీ కలిగిన లిఫ్ట్‌లు కావడంతో వరంగల్ నుంచి సిబ్బంది మరమ్మతు చేసేందుకు పది రోజుల సమయం పట్టింది. మళ్లీ ఏమైనా సమస్య ఏర్పడితే ఇబ్బంది అవుతుందనే భావనతో అధికారులు దివ్యాంగులు, వృద్ధులు మాత్రమే లిఫ్ట్ ఉపయోగించాలంటూ గురువారం బోర్డు ఏర్పాటు చేశారు. – ఖమ్మం సహకారనగర్



కలెక్టరేట్‌లోని లిఫ్ట్ (ఇన్‌సెట్) ఉపయోగంపై ఆంక్షలు విధిస్తూ అంటించిన బోర్డు


చెక్కులు అందజేస్తున్న సీపీ వారియర్

హోంగార్డ్ ఆఫీసర్లకు చేయూత
ఖమ్మంక్రైం: జిల్లాలోని హోంగార్డ్ ఆఫీసర్లు ఐదుగురి కుటుంబ సభ్యులకు మంజూరైన ఆర్థిక సాయాన్ని సీపీ విష్ణు ఎస్.వారియర్ గురువారం అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న హోంగార్డ్‌లకు మంజూరైన మెడికల్ బిల్లులతో పాటు విధినిర్వహణలో మృతి చెందిన హోంగార్డ్‌ల కుటుంబాలకు మంజూరైన నగదును ఆయన అందజేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐలు శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘సాక్షి’ సేవలు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సురేష్, సాక్షి ఉద్యోగులు

కొణిజర్ల: పాఠకుల సమస్యలు పరిష్కారమయ్యేలా కథనాలు ప్రచురిస్తుండడమే కాక సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్న ‘సాక్షి’ కృషి అభినందనీయమని వైరా సీఐ తాటిపాముల సురేష్ కొనియాడారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని ‘సాక్షి’ యూనిట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటుతో వాహనదారులకు దాహార్తి తీరుతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ మోహనకృష్ణ, ఏసీఎం ప్రదీప్, స్టోర్స్ ఇన్‌చార్జి రాంబాబు, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసచారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల్లోని గ్రామాల్లో పర్యటించనున్న ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా భార్గవ్



భార్గవ్‌నాయుడు

ఎర్రుపాలెం: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా ఎర్రుపాలెంకు చెందిన అనుమకొండ భార్గవ్‌నాయుడు నియమితులయ్యా రు. ఈమేరకు రాష్ట్ర కోఆర్డినేటర్ పెట్టం నవీన్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేడీజీఈసీసీ, టీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఏలూరి



శ్రీనివాసరావు, అధ్యక్షుడు



ఈ.రవిచంద్ర, కార్యదర్శి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల పరపతి, పొదుపు సహకార సంఘం (కేడీజీఈసీసీ అండ్ టీఎస్ లిమిటెడ్, ఖమ్మం) జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఐదేళ్ల కాలానికి గాను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు గురువారం ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కొత్త రాజు, కార్యదర్శిగా ఈ.రవిచంద్ర, కోశాధికారిగా పొట్టపెంజర రాజారావు, కార్యవర్గ సభ్యులుగా మోత్కూరి మధు, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, మాడపాటి ఉషారాణి, వడిత్య భద్రమ్మ, కాట్రగడ్డ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

ఏఎస్సై పేరిట డబ్బు స్వాహాకు యత్నం

నేలకొండపల్లి: ‘నేను ఏఎస్సైను... అర్జెంట్‌గా తెలిసిన వారికి డబ్బు పంపాలి... నా వద్ద నగదు ఉంది.. అది వెంటనే పంపిస్తాను, ఆలోగా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయండి’ అనే సూచనను నమ్మిన ఓ వ్యక్తి ట్రాన్స్‌ఫర్ చేయగా ఫోన్ చేసిన ఆగంతకుడు పోలీసు కాదని తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా నగదు డ్రా చేసుకోకుండా అడ్డుకున్నారు. వివరాలు.. నేలకొండపల్లికి చెందిన మీ సేవ ప్రతినిధికి గురువారం ఓ వ్యక్తి ఫోన్ చేసి ఏఎస్సైగా పరిచయం చేసుకున్నాడు. తనకు కావాల్సిన వారికి నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరగా, పక్కనే మనీ ట్రాన్స్‌ఫర్ చేసే రఫీ వద్దకు మాట్లాడించారు. దీంతో ఆయన నమ్మి ఏఎస్సైగా పరిచయం చేసుకున్న ఆగంతకుడి సూచనల మేరకు రూ.45 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. కానీ ఎంతకూ నగదుతో వస్తానన్న మనిషికి రాకపోవడంతో పోలీసుస్టేషన్‌కు వెళ్లగా ఎస్సై జి.స్రవంతి సిద్ధిపేటకు చెందిన ఓ వ్యక్తి అకౌంట్‌లో జమ అయినట్లు గుర్తించారు. ఆ నగదు డ్రా చేసుకోకుండా హోల్డ్‌లో పెట్టించి, ఐటీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,930	1,750
పెసలు	7,700	6,000
కందులు	8,000	6,300
అలసంద	6,500	6,400
మిర్చి	23,800	17,000
మిర్చి తాలు	15,000	9,000
పత్తి	7,750	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

మృత్యువుకు స్వాగతం

కేన్సర్‌తో చనిపోతానని తెలిసినా ధైర్యం వీడని యువకుడు

- భార్యకు విడాకులు.. తల్లిదండ్రులకు మనోధైర్యం
- ఆస్ట్రేలియాలో ముగిసిన ఖమ్మం యువకుడి జీవితం



తల్లిదండ్రులతో హర్షవర్ధన్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఊపిరితిత్తుల కేన్సర్ సోకడంతో మృత్యువు సమీపిస్తుందని స్వయానా వైద్యుడైన ఆ యువకుడు గుర్తించాడు. అయితే, మృత్యువు కబళించబోతోందని అందరిలా మనోధైర్యాన్ని కోల్పోలేదు. సమయం దగ్గర పడిందని తెలిసినా మరణాన్ని ఆహ్వానిస్తూ ముందస్తుగా ఏర్పాట్లు చేసుకున్నాడు. విదేశంలో ఉంటున్నా తల్లిదండ్రులకు ధైర్యంగా చెప్పడమే కాక తననే నమ్ముకున్న భార్యకు విడాకులు ఇచ్చి ఆమె మెరుగైన భవిష్యత్‌కు బాటలు వేశాడు. ఖమ్మంకు చెందిన ఆ యువకుడు తాజాగా కన్నుమూయగా బుధవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఖమ్మంకు చెందిన యేపూరి రామారావు – ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హర్షవర్ధన్(32) ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఉన్న ఓల్డేజ్ హోమ్‌లో జనరల్ మెడిసిన్‌లో వైద్యసేవలు అందిస్తున్నాడు. 2020 అక్టోబర్‌లో ఆయనకు ఊపిరితిత్తుల కేన్సర్ సోకినట్లు తేలింది. కొన్నాళ్ల చికిత్సతో తగ్గినట్లే అనిపించినా కొన్ని నెలలకు తిరగబెట్టింది. ఈసారి చికిత్సకు నయమయ్యే పరిస్థితి లేదని గుర్తించిన వైద్యులు మరణం తప్పదని హర్షకు చెప్పారు. వ్యాధి తీవ్రతపై అవగాహన ఉండడంతో హర్ష ఆస్ట్రేలియా నుంచి ఖమ్మంలోని తల్లిదండ్రులకు ప్రతి రోజు వీడియోకాల్ చేసి మాట్లాడుతుండేవాడు. తనకు ఏది జరిగినా తట్టుకునేలా వారిని సిద్ధం చేసిన ఆయన.. ఖమ్మం రావాలని తల్లిదండ్రులు సూచించినా రాకపోగా వారు ఆస్ట్రేలియా వెళ్తానన్నా వారించాడు. కాగా, 2020లో తొలినాళ్లలో హర్షవర్ధన్‌కు వివాహం జరగగా, వీసా సమస్య కారణంగా భార్యను ఆస్ట్రేలియా తీసుకెళ్లలేకపోయాడు. ఆ తర్వాత కేన్సర్ విషయం తెలియడంతో హర్షవర్ధన్ ఆమె భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో పెద్దలను ఒప్పించి విడాకులు ఇచ్చాడు.

అన్నీ పంచుకున్నా..

నాకు కొడుకైనా, కూతురైనా హర్షవర్ధనే. సహజంగా తల్లులు కూతుర్లతో అన్ని విషయాలు మాట్లాడతారు. కానీ నా కొడుకు ఏ విషయాన్ని దాచలేదు. నేను కూడా ప్రతీ విషయం చెప్పేదాన్ని. కేన్సర్ సోకడం, చనిపోయే విషయాన్ని కూడా మాకు ముందే చెప్పి మేం బాధపడకుండా ఓదార్చేవాడు. మమ్మల్ని చూసుకోవాల్సిన సమయంలో దూరమవుతున్నానని బాధపడేవాడు.

– ప్రమీల, హర్షవర్ధన్ తల్లి

తమ్ముడి పెళ్లికి వస్తానని..

హర్షవర్ధన్ తమ్ముడు అఖిల్ వివాహం ఇటీవల నిశ్చయమైంది. వివాహానికి హాజరయ్యేందుకు మే 23న ఖమ్మంకు వచ్చేందుకు టికెట్లు రిజర్వు చేయించుకున్న ఆయన తిరుగు ప్రయాణానికి జూన్ 14న టికెట్లు కూడా బుక్ చేసుకున్నాడు. తమ్ముడి వివాహ వేడుకలో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడపాలని కలలు కన్నాడు. ఇంతలోనే వ్యాధి తీవ్రత కారణంగా హర్ష మార్చిలో కన్నుమూయడం ఖాయమని వైద్యుల ద్వారా తెలుసుకున్నాక ఎవరికీ భారం కావొద్దని భావనతో అక్కడి న్యాయవాదితో మాట్లాడి మృతదేహాన్ని స్నేహితులకు ఇచ్చేలా అగ్రిమెంట్ రాశాడు. అలాగే, కారు అమ్మడంతో పాటు శవపేటికను ఆర్డర్ చేసుకున్నాడు. మృతదేహం తరలింపునకు అయ్యే నగదును కూడా స్నేహితులకు అందజేశాడు. పంటిబిగువున బాధ భరిస్తూనే స్నేహితులతో కలిసి ఆస్ట్రేలియాలోని పలు ప్రదేశాలను సందర్శించాడు. చివరకు గత నెల 24 ఉదయం హర్షవర్ధన్ తన తల్లికి ఫోన్ చేసి స్నేహితులతో కలిసి టిఫిన్ చేయడానికి వెళ్తున్నట్లు చెప్పాడు. కాగా, టిఫిన్ చేశాక కాఫీ కోసం బయటకు వచ్చిన ఆయన బాత్‌రూంకు వెళ్లగా మూత్రంలో రక్తం రావడంతో ఇబ్బంది పడ్డాడు. ఒంట్లో బాగాలేదని, విశ్రాంతి తీసుకుంటానని స్నేహితులకు చెప్పి పడుకున్న హర్ష ఆరోజే శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. మళ్లీ ఫోన్ చేస్తా నన్న కొడుకు చేయలేదని తల్లి ప్రమీల స్నేహితులను ఆరా తీయగా అసలు విషయం తెలిసింది. ఆయన మృతదేహాన్ని బుధవారం ఖమ్మం తీసుకురాగా, తల్లిదండ్రులు, కుటుంబీకుల రోదనలు నడుమ అంత్యక్రియలు పూర్తిచేశారు.

సిలువ యాత్రకు వేళాయె!

- నేడు శ్రమల విముక్తి దినం.. గుడ్‌ఫ్రైడే
- 9న ఈస్టర్ పండుగకు ఏర్పాట్లు
- ప్రత్యేక ప్రార్థనలకు జిల్లాలోని చర్చిల్లో ఏర్పాట్లు

ఖమ్మంగాంధీచౌక్/వైరా: మంచికి దూరంగా.. అసత్య మార్గంలో వెళ్తున్న ప్రజల పాప పరిహారార్థమే కాక వారిలో మానవత్వం, మంచితనం నింపేందుకు ఏసుక్రీస్తు సిలువ యాగం చేశారని బైబిల్ చెబుతోంది. ఏసుక్రీస్తు సిలువకు ముందు ఎంతో మంది నేరస్తులు సిలువకు వేలాడి శిక్ష అనుభవించినా... నిరపరాధి అయిన ఏసు సిలువకు వేలాడడంతో దాని అర్థమే మారిపోయింది. ఏసు క్రీస్తు సిలువ.. ప్రేమకు, త్యాగానికి, పరలోకార్హత పొందడానికి ప్రతీకగా మారింది. పాపం చేసిన వారిని శిక్షించడం కన్నా.. మనిషిలోని పాపాన్ని సిలువ వేయాలని, ఈ క్రమంలో మనిషి ప్రేమ, క్షమ, కరుణ, మూర్తీభవించిన క్రీస్తు ప్రభువులో పునరుత్థానం చెందుతాడు. ఇదే శుభ శుక్రవార పర్వదినం(గుడ్ ఫ్రైడే) అందించే శుభ సందేశం.

ముగియనున్న ఉపవాస దీక్షలు..

ప్రార్థన, ప్రాయశ్చిత్తం, ఉపవాస దీక్షలు.. ఇదీ నలభై రోజుల ఉపవాస దీక్షల సారాంశం. సర్వమానవాళి పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు లోకానికి వచ్చి సిలువపై మరణించాడని బైబిల్ చెబుతోంది. సిలువ వేయక ముందు ఏసు అనుభవించిన శ్రమలను ఈ ఉపవాస రోజుల్లో క్రైస్తవులు ధ్యానించారు. దైవ కుమారుడిగా శ్రమలను జయించే శక్తి ఉన్నా.. మానవుడి మాదిరి జీవితాన్ని చూపడానికి శ్రమలను ఎదుర్కొన్నారనే విషయాన్ని స్మరించుకున్నారు. ఉపవాస దీక్షలతో కోరికలను అణచుకోవడం, పాపాల నుంచి క్షమాపణ కోరుకోవడం.. ఇలా నలభై రోజులపాటు భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలను గుడ్‌ఫ్రైడే సందర్భంగా ముగిస్తారు. కాగా, గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లాలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఎందరో త్యాగాల కృషి ఫలితమే బీజేపీ



జెండా ఎగురవేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎందరో త్యాగాల కృషి ఫలితమే బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన జెండా ఎగురవేసి మాట్లాడారు. నాడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయ్, లాల్‌కృష్ణ అద్వానీ తదితరులు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పాటుపడుతున్నామని తెలిపారు. సామాన్య కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించిన నరేంద్రమోదీ ప్రధాని కాగలిగారంటే కేవలం బీజేపీ ద్వారానే సాధ్యమైందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నన్నె ఉదయ్‌ప్రతాప్ మాట్లాడగా, జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్‌తో పాటు నాయకులు సరస్వతి, విజయరెడ్డి, అల్లిక అంజయ్య, నెల్లూరి కోటేశ్వరావు, అరుణ, ఎల్లారావుగౌడ్, వెంకట్, దీకొండ శ్యాం, కోటి, విక్రంజాదవ్, ఫణికుమారి, పసుమర్తి సతీష్, రజనీరెడ్డి, సుగుణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ ఏర్పాటుకు అడుగులు!



ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై వేసిన మార్కింగ్

నేలకొండపల్లి: డోర్నకల్ జంక్షన్ నుంచి నేలకొండపల్లి మీదుగా మిర్యాలగూడెంకు కొత్త రైల్వే లైన్ నిర్మించాలనే ప్రతిపాదనలకు మోక్షం లభిస్తోంది. ఈ రైలు మార్గం సర్వే కోసం కేంద్రప్రభుత్వం రూ.3కోట్లు కేటాయించి ప్రైవేట్ సంస్థకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సంస్థ బాధ్యులు గురువారం నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, ఆచార్లగూడెం, కోనాయిగూడెం(కోరటేన్), బోదులబండ, రామచంద్రాపురం మీదుగా కోదాడ వైపు సర్వే చేపట్టారు. పంట పొలాలు, వ్యవసాయ బావులు, కాల్వలు, గుట్టలు, వంతెనలు, కల్వర్టులను డ్రోన్ ద్వారా చిత్రీకరిస్తూ మార్కింగ్ వేస్తున్నారు.

పూలే జయంతికి ఏర్పాట్లు



బీసీ సంఘాల నాయకులతో డీడీ జ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. ఈమేరకు కలెక్టరేట్‌లో గురువారం ఆమె బీసీ సంఘాల నాయకులతో సమావేశమై జయంతి ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జక్కుల వెంకటరమణ, పేరెల్లి విజయ్‌కుమార్, నారాయణవరపు శ్రీనివాసరావు, షేక్ షకీనా, పెరుగు వెంకటరమణ, గట్టు కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

తిరుమలాయపాలెం: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగంగా చేపడుతూ అడిగిన వారందరికీ పని కల్పించాలని డీఆర్డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని కొక్కిరేణిలో గురువారంఆమె ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. అలాగే, మండలంలోని పిండిప్రోలులో మహిళా సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన మిర్చి కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే మహిళా సంఘాల ద్వారా మిర్చి కొనుగోళ్లు చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, ఏపీఓ నర్సింహారావు, ఏపీఎం అలివేలు మంగతో పాటు వెంకటేష్, బండ్ల నాగేశ్వరరావు, సావిత్రి, మనోహర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్యమృగాలను సంరక్షించాలి



కలపవేలంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ మంజుల

ఏన్కూరు: వన్యమృగాలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల అన్నారు. ఏన్కూరు మండలం భగవాన్‌నాయక్ తండా సమీపంలోని వెదురుడిపోలో గురువారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ ఈ ఏడాది ఆరు లక్షల వెదురు బొంగుల సేకరణ లక్ష్యంతో ఇప్పటివరకు 3.80 లక్షల బొంగులు సేకరించామని తెలిపారు. ఇందులో వేలం ద్వారా రూ.58లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కాగా, అడవుల్లో వన్యమృగాలు వేసవిలో ఇబ్బంది పడకుండా తాగునీటి తొట్లు ఏర్పాటుచేస్తుండగా, అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తల్లాడ డీఆర్‌ఓ బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మనీ సర్క్యులేషన్ మాయాజాలం!

నేలకొండపల్లి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నా కొందరు అత్యాశతో పెడచెవిన పెడుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఇటీవల కాలంలో మనీ సర్క్యులేషన్ చైన్ సిస్టమ్ జోరుగా సాగుతోంది. ఒక్క నేలకొండపల్లి మండలంలోనే 500 నుంచి 600 మంది వరకు చేరినట్లు సమాచారం. సంఘంలో చేరేందుకు రూ.800 చెల్లించాలని, వీరికి ప్రతీరోజు రూ.32 జమ అవుతాయని చెప్పడంతో పలువురు నమ్మారు. చెల్లించిన నగదు నెలలోగా తిరిగివస్తుండడంతో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు చేరడమే కాక ఇంకొందరిని చేర్పించారు. చివరకు రెండు రోజులుగా యాప్ ఓపెన్ కాకపోవటంతో మోసపోయామని గుర్తించి గగ్గోలు పెడుతున్నారు.

స్కాంలు, లీకేజీల్లో పోటీపడుతున్న బీజేపీ, బీఆర్ఎస్



కోండ్రుపాడులో కరపత్రాలు అందజేస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

పెనుబల్లి : స్కాంలు, ప్రశ్నపత్రాల లీకేజీలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా పెనుబల్లి మండలం అగ్రహారం, కోండ్రుపాడు, గణేష్‌పాడు, ముత్తగూడెంల్లో గురువారం ఆయన కాంగ్రెస్ జెండాలు ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేతకాని తీరుతో స్కాంలు, పేపర్ లీకేజీలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. పాలకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని కూడా నెరవేర్చలేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమను ఆదరిస్తే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, వృద్ధాప్య పింఛన్ రూ.5 వేలు, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెలికాని రాజబాబు, నాయకులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కొండూరు కిరణ్, వడ్లమూడి కృష్ణయ్య, గరిమెళ్ల సత్యనారాయణ, మాచినేని మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుడిపై ఆర్టీసీ డ్రైవర్ దాడి



ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేస్తున్న డ్రైవర్

మధిర: మధిరలో ద్విచక్ర వాహనంపై భార్యతో వెళ్తున్న వ్యక్తిపై ఆర్టీసీ డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు డిపోకు చెందిన బస్సు గురువారం తిరువూరు నుంచి మధిర వస్తోంది. ఈ క్రమంలో ఎదురుగా మోటార్ సైకిల్‌పై వచ్చిన దంపతులను బస్సు డ్రైవర్ అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలిసింది. దీంతో వారు ప్రశ్నించగా బస్సు డోర్ తీసి కాలితో తన్నిన డ్రైవర్.., కిందకు దిగి మళ్లీ ద్విచక్ర వాహనదారుడుపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనను వీడియో తీసిన స్థానికులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా స్థానికులు డ్రైవర్ తీరును తప్పుపడుతున్నారు.

లైంగిక దాడికి యత్నం

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురానికి చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎం.జయరాజు లైంగిక దాడికి యత్నించాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై బుధవారం రాత్రి జయరాజు లైంగికదాడికి యత్నించగా.. గురువారం బాధితురాలి ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రెండు అంతస్తుల్లో చోరీ జరిగింది. రాపర్తినగర్‌లోని భవనం మొదటి అంతస్తులో నివాసముంటున్న భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ మాధగాని ఉమారాణి గురువారం ఉదయం కార్యాలయానికి వెళ్లారు. కింద పోర్షన్‌లో ఉండే యజమాని గౌరి కూడా తాళంవేసి బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటి యజమాని కుమార్తె లక్ష్మీచిన్మయి చోరీ జరిగినట్లుగా గుర్తించి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో వచ్చి పరిశీలించగా ఉమారాణి ఇంట్లోని రూ.60వేల విలువైన బంగారంతోపాటు 25తులాల వెండి, యజమాని గౌరి ఇంట్లో రూ.40వేల విలువైన బంగారం, 20తులాలకు పైగా వెండి చోరీ అయినట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా..

- గేదెను ఢీకొట్టిన ఆటో.. ఒకరు మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



పల్టీ కొట్టిన ఆటోను లేపుతున్న స్థానికులు



కోటయ్య మృతదేహం

నేలకొండపల్లి: ఆ కుటుంబమంతా దైవదర్శనం చేసుకుని తిరుగుముఖం పట్టారు.. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరాల్సి ఉండగా గేదె రూపంలో మృత్యువు ఎదురైంది. రహదారిపై వెళ్తున్న గేదెను ఆటో ఢీకొట్టగా ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా పలువురికి తీవ గాయాలయ్యాయి. ఈప్రమాదం వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లికి చెందిన వార్డు సభ్యురాలు బండి వరలక్ష్మి కుటుంబ సభ్యులతో గురువారం ఏపీలోని పెనుగ్రంచిప్రోలు దేవాలయానికి వెళ్లారు. అక్కడ దర్శనం అనంతరం ఆటోలో సాయంత్రం తిరిగి వస్తుండగా మండలంలోని అజయ్‌తండా వద్దకు వచ్చే సరికి చీకటి పడింది. ఈక్రమంలో రోడ్డుపై వెళ్తున్న గేదెలు కనిపించక ఓ గేదెను వీరి ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా బండి కోటయ్య(65) మృతి చెందాడు. అలాగే, వరలక్ష్మి , మహేశ్వరరావు, బండి సంజన, వేముల ఏసుకు తీవ్ర గాయాలు కావడంతో నేలకొండపల్లి ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా ఈ ప్రమాదం జరగడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

చింతకాని: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి ఖమ్మంకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని నాగులవంచ పెట్రోల్ బంక్ వద్ద తహసీల్దార్ మంగీలాల్ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని వత్సవాయి గ్రామానికి ఇసుక తరలించేందుకు కూపన్ తీసుకుని ఖమ్మం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

సాగర్ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న అన్నం ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెం వద్ద సాగర్ కాల్వలో గుర్తు తెలియని వృద్ధుడి(60) మృతదేహాన్ని గురువారం గుర్తించారు. ఎగువ నుంచి కొట్టుకొచ్చిన మృతదేహం కుళ్లిపోయి కాల్వలోని రాళ్లకు తట్టుకొని ఆగింది. దీంతో పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేపటినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

క్షణికావేశంలో పురుగుల మందు తాగిన దంపతులు

భర్త మృతి, ప్రాణాపాయ స్థితిలో భార్య



చంటి (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని పరికలబోడు తండాకు చెందిన భార్యాభర్తలు గురువారం క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో భర్త మృతి చెందగా భార్య ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం ప్రకారం... వ్యవసాయం కోసం చేసిన అప్పుల విషయంపైనే కాక ఇతర కుటుంబ అంశాలపై బానోత్ చంటి(30), భార్య కుమారి గురువారం ఉదయం ఘర్షణ పడ్డారు. దీంతో క్షణికావేశంలో తొలుత చంటి, ఆతర్వాత కుమారి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగారు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్య ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతుంది. ఈ దంపతులకు ఆరేళ్ల లోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి సీతారాం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం ఎస్సై ఎం.రవి తెలిపారు.

క్లుప్తంగా...

కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ మొదలుపెడతామని చెప్పారు

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారన్న ఎంపీ ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పనులను మొదలు పెడతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఉత్తమ్ పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. డోర్నకల్ - నేలకొండపల్లి - కోదాడ - హుజూర్ నగర్ - నేరేడుచర్ల - మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని కోరారు. దీంతో పాటే మోతమర్రి-జగ్గయ్యపేట-మేళ్లచెర్వు-మఠంపల్లి-జాన్ పహాడ్-విష్ణు పురం-మిర్యాలగూడ రైల్వే లైన్‌లో ప్యాసింజర్ రైళ్లను నడపాలని, ఈ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలని కోరారు.

వందేభారత్‌ను నల్లగొండలో ఆపుతామని హామీ

మోతుమర్రి-మిర్యాలగూడ మధ్య ప్యాసింజర్ రైళ్లను నడుపుతామని, డబ్లింగ్ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. విశాఖ- తిరుపతి వందేభారత్‌తో పాటు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నల్లగొండలో ఆపేలా చర్య లు తీసుకుంటామని, మిర్యాలగూడలో ఆపే విషయంపై పరిశీలన చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు.

టీఎస్‌పీఎస్సీ కేసులో కేటీఆర్‌ను విచారించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీకేజీ అంశాన్ని పక్కదారి పట్టించే కుట్రలో భాగంగానే బండి సంజయ్ అరెస్టుతో పాటు రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. 30 లక్షల కుటుంబాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని విచారిస్తే మంత్రి కేటీఆర్ బండారం బయటపడుతుందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ కేసులో కేటీఆర్‌ను సైతం విచారించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ, మంత్రి కేటీఆర్ సిఫారసుతోనే టెక్నికల్ సర్వీసెస్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఏపీ సర్వీసులో ఉన్న ఏ2 ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీలో అక్రమంగా చొరబడి పేపర్ లీకేజీకి తెరతీశారని ఆరోపించారు. టెక్నికల్ సర్వీసెస్ చైర్మన్ జగన్మోహన్ రావు మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడని అన్నారు. మంత్రి కేటీఆర్‌ను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అది వదిలేసి రేవంత్‌రెడ్డి, సంజయ్‌పై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్న బండి సంజయ్‌ను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు.

అవును.. మళ్లించాం

▶ మొదటి పేజీ తరువాయి

చట్టం తమకు వర్తించదని దబాయించడం రామోజీరావు, ఆయన కుటుంబం బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. సీఐడీ అధికారులకు రికార్డులు చూపించబోమని శైలజా కిరణ్ భీష్మించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజను సీఐడీ అధికారులు గురువారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని ఆమె నివాసంలో విచారించారు. సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్, విచారణ అధికారి రవికుమార్‌లతోపాటు 25 మంది అధికారుల బృందం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారించింది. శైలజ తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయవాదులతోపాటు తెలంగాణ హైకోర్టు న్యాయవాది కూడా విచారణ ప్రక్రియ సమయంలో ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన విచారణ ప్రక్రియను సీఐడీ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. దాదాపు 75 ప్రశ్నలకు వివరాలు రాబట్టి వాంగ్మూల పత్రంపై శైలజ సంతకం తీసుకున్నారు. గతంలో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా శైలజ నుంచి పలు కీలక విషయాలను సీఐడీ అధికారులు రాబట్టినట్టు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం విచారణలో ఆమె వెల్లడించిన విషయాలు ఇలా ఉన్నాయి...

చందాదారుల సొమ్మును మళ్లించాం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీల్లో సేకరించిన పలు కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ సీఐడీ అధికారులు శైలజను విచారించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను రామోజీ గ్రూపునకు చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ (కర్ణాటక)- బెంగళూరు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నైలలో అక్రమ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్న విషయాన్ని ఆమెకు చూపించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏకంగా 88.5 శాతం వాటా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిటే ఉంది. ''అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను ఆ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాం..'అని శైలజ అంగీకరించినట్లు సమాచారం.

ఏ చట్టాలు వర్తించవు... మా చట్టం మాకుంది

చందాదారులు చెల్లించిన నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982కు వ్యతిరేకం కదా...! ఆ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం అందుకు రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని తెలుసు కదా..? అని సీఐడీ అధికారులు శైలజను ప్రశ్నించారు. అయితే అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తనకు తెలియదని ఆమె చెప్పడంతో సీఐడీ అధికారులు విస్తుపోయారు. చిట్‌ఫండ్స్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మీకు అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తెలియదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ చట్టం- 1982ను తాము అనుసరించబోమని ఆమె సమాధానం ఇవ్వడంతో నివ్వెరపోవడం సీఐడీ అధికారుల వంతైంది. మరి చిట్‌ఫండ్స్ వ్యాపారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించ



గురువారం హైదరాబాద్‌లో శైలజా కిరణ్‌ను విచారిస్తున్న సీఐడీ అధికారులు

గా.. మా చట్టాలు మాకున్నాయి... వాటి ప్రకారం చేస్తున్నాం అని ఆమె బదులిచ్చినట్లు సమాచారం.

చట్టం అనుసరిస్తామంటూ...తెలీదంటూ

సీఐడీ అధికారులు అదే విషయంపై గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతో తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామని శైలజ పేర్కొనట్లు సమాచారం. చిట్‌ఫండ్స్ వ్యాపారానికి కంపెనీల చట్టంతో నిమిత్తం లేదని, అనుసరించాల్సింది కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం -1982 కదా? అని అధికారులు ప్రశ్నించగా ఆమె సమాధానం ఇచ్చేందుకు నిరాకరించినట్టు తెలుస్తోంది. పోనీ కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నారని భావించినా... ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5 శాతం వాటాతోపాటు మరో రెండు కంపెనీల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు కదా? అని అధికారులు ప్రశ్నించడంతో అవునని ఆమె సమాధానమిచ్చారు. కంపెనీల చట్టం ప్రకారం 50 శాతానికి మించి వాటా కలిగి ఉంటే అనుబంధ కంపెనీగానే పరిగణిస్తారు కదా? అని తిరిగి ప్రశ్నించగా అందుకు కూడా ఆమె అవుననే సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది.

ఏటా రూ.వందల కోట్ల చెక్కులు..

విచారణ సందర్భంగా సీఐడీ మరో కీలక ఆధారాన్ని సేకరించింది. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తున్న రామోజీరావు, శైలజ రికార్డుల్లో మాత్రం చట్టాన్ని ఏమార్చేందుకు యత్నించారని నిరూపితమైంది. 2022 మార్చి 31న రూ.255 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ చెక్కులేవీ తరువాత నగదుగా మారినట్లు (ఎన్‌క్యాష్)గా రికార్డుల్లో లేవని సీఐడీ అధికారులు గుర్తించారు. గరిష్ఠంగా పది రోజుల్లో చెక్కులను నగదుగా జమ చేస్తామని శైలజ పేర్కొన్నారు. మరి గతేడాది మార్చి 31న వచ్చినట్లు చూపించిన రూ.255 కోట్ల చెక్కులేవీ నగదుగా మారినట్లు రికార్డుల్లో ఎందుకు లేవని సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజ తెల్లమొహం వేశారని సమాచారం. కొన్ని దశాబ్దాలుగా ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు రికార్డుల్లో చూపుతున్నా అవి నగదుగా మాత్రం మారడం లేదు. ఎందుకంటే ఏటా చందాదారులు చెల్లిస్తున్న రూ.వందల కోట్లను మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా సొంత ప్రయోజనాలకు మళ్లిస్తోంది. ఆర్థిక సంవత్సరం చివరిలో ఆ నిధులు ఉన్నట్లుగా చూపించాల్సి రావడంతో చెక్కులు వచ్చినట్లు చూపించి కనికట్టు చేస్తోంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు.

ఉన్నాయి కానీ.. చూపించను

లేని చెక్కులు ఉన్నట్టుగా చూపించి మోసానికి పాల్పడినట్టు నిరూపితం కావడంతో శైలజ షాక్‌కు గురయ్యారు. దాంతో సీఐడీ అధికారులను పక్కదారి పట్టించేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. 'ఆ చెక్కుల సమాచారం అంతా ప్రధాన కార్యాలయంలో ఉంటుంది... 'అని పేర్కొన్నారు.

ఏపీ రికార్డులు ప్రత్యేకంగా లేవు

చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు ఏ రాష్ట్రానికి సంబంధించిన రికార్డులు ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిర్వహించాలి. అక్కడి చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, చిట్టీల వివరాలు, ఆదాయ-వ్యయాలు, బ్యాలన్స్‌షీట్‌ను ప్రత్యేకంగా రూపొందించాలి. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, ఇతర వివరాలను తెలంగాణ, ఇతర రాష్ట్రాల రికార్డులతో పాటు కలిపి నిర్వహిస్తోంది. ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రామోజీరావు కుటుంబానికి చెందిన ఇతర కంపెనీల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతోంది.

నీళ్ల నమిలి... నీళ్లు తాగి

సీఐడీ అధికారులు నిబంధనలు పాటిస్తూ శైలజా కిరణ్‌ను విచారించారు. విచారణకు ఆమె సహకరించకపోయినా సరే ఒత్తిడి చేయకుండా ప్రశ్నలు సంధించారు. గురువారం రోజు మధ్యాహ్నం వరకు సాగిన మొదటి విడతలో చాలా ప్రశ్నలకు నాకు తెలియదు.. గుర్తులేదు...నాకు సంబంధం లేదు అంటూ ఆమె సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు. దాంతో చాలా ప్రశ్నలకు ఆమె నీళ్లు నమిలినట్లు సమాచారం. విచారణ సందర్భంగా ఆమె పలుసార్లు తనకు దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి వచ్చారు.

చూపు సరిగా లేదు.. కనిపించడం లేదు

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను ల్యాప్‌టాప్‌లో సీఐడీ అధికారులు శైలజకు చూపించారు. నిధులు మళ్లించినట్టు అందులో ఉన్న వివరాలను చూపిస్తూ అవి వాస్తవమేనా? అని అడిగారు. అయితే ఆ పత్రాలు తనకు కనిపించడం లేదని... పేర్కొనడంతో సీఐడీ అధికారులు ల్యాప్‌టాప్‌లో ఎన్‌లార్జ్ చేసి మరీ చూపించారు. 'నాకు చూపు సరిగా లేదు... ఆ పత్రాల్లో ఏముందో కనిపించడం లేదు'అని శైలజ పేర్కొనడంతో సీఐడీ అధికారులు మధ్యవర్తిగా ఉన్న ఓ వ్యక్తిని పిలిచి ఆ పత్రాలు చూపించారు. అవి తనకు కనిపిస్తున్నాయని ఆయన చెప్పడంతో పాటు అందులో ఏముందో చదివి వినిపించారు. దీంతో తనకు ఏమీ కనిపించడంలేదని తప్పించుకునేందుకు శైలజ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది.

సలేశ్వరం.. జనసంద్రం

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతించిన ప్రకారం లింగమయ్య దర్శనానికి శుక్రవారం చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

యంత్రాంగం ఫెయిల్...

సలేశ్వరం లింగమయ్య జాతర పూర్వం వారం పాటు జరిగేది. ఆ తర్వాత కాలంలో ఐదు రోజుల పాటు నిర్వహణకు అటవీశాఖ అనుమతి ఇవ్వగా కరోనా నేపథ్యంలో 2020, 2021లో ఉత్సవాలు రద్దయ్యాయి. ఆ తర్వాత పరిస్థితులు మెరుగుపడటంతో గతేడాది, ప్రస్తుతం మూడు రోజులకే ఉత్సవాలను అటవీశాఖ కుదించింది. దీంతో భక్తులు లక్షలాదిగా పోటెత్తారు. మరోవైపు టోల్‌గేట్ రుసుము కోసం నిర్దేశిత సమయం దాటినా వేల సంఖ్యలో వాహనాలను అనుమతించడంతో ఉదయం వెళ్లి తిరుగుపయనమైన వారు.. లింగమయ్యను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులతో దారి మొత్తం కిక్కిరిసింది. అలాగే ఆర్టీసీ బస్సుల హోల్టింగ్‌ను రాంపూర్ నుంచి పుల్లాయపల్లికి మార్చడం, మధ్యాహ్నం 3:30 గంటల తర్వాత బస్సులను నిలిపివేయడంతో భక్తులు నరకయాతన అనుభవించారు. తెలంగాణలో అతిపెద్ద సాహస యాత్రగా పేరొందిన గిరిజన జాతరకు అధికార యంత్రాంగం కనీసం ఉచిత తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదని భక్తులు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా కనీస చొరవ చూపలేదంటూ దుయ్యబట్టారు.

దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగా..

లోయలోకి దిగకముందే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో భయం వేసింది. ఇప్పుడు ఇబ్బంది పడేకన్నా వచ్చే ఏడాదైనా లింగమయ్యను దర్శించుకోవచ్చని.. దూరం నుంచి దండం పెట్టుకొని వెనుదిరిగాను.

- లక్ష్మి, చిన్నకొత్తపల్లి, పెద్దకొత్తపల్లి మండలం

ఒకరిద్దరే పోలీసులు

పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గం వెంట పోలీసు బందోబస్తు లేదు. లోయలోకి దిగే మార్గంలో భక్తులను అదుపు చేసే వారే కరువయ్యారు. స్నానాలు చేసే గుండం దగ్గర ఒకరిద్దరు పోలీసులే ఉన్నారు. - శివ, జగన్నాథపురం

భారీ ధరలు

క్షేత్రంలో పలు రకాల వస్తువుల ధరలు విపరీతంగా ఉన్నాయి. లీటర్ నీళ్ల బాటిల్‌ను రూ. 70కి, టెంకాయ రూ. 50కి విక్రయిస్తున్నారు. అయినా అధికారులు ఎవరూ వారిని నియంత్రించలేదు.

- రవీందర్, వనపట్ల, నాగర్‌కర్నూల్ మండలం

చేయని తప్పుకు నన్ను బలిచేశారు

- పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం ఇవ్వండి
- ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి హరీశ్ వేడుకోలు
- విద్యార్థి హాల్‌టికెట్ తీసుకుని బయటికి పంపిన హనుమకొండ డీఈవో



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్, అతని తల్లి లలిత


కమలాపూర్: చేయని తప్పుకు తనను బలిచేశారని పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి దండెబోయిన హరీశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఈ నెల 4న హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన హరీశ్ గురువారం ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు పరీక్షకేంద్రానికి రాగా, డీఈవో ఎండీ అబ్దుల్ హై అతని హాల్‌టికెట్ తీసుకొని బయటకు పంపించారు. అనంతరం హరీశ్ తన తల్లి లలితతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ రోజు పరీక్ష కేంద్రం కిటికీ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి 'తమ్ముడు ప్రశ్నపత్రం ఇవ్వు' అని అడిగాడని, తాను ఇవ్వనని చెప్పి ఇన్విజిలేటర్‌కు చెబుదామనుకుంటున్న సమయంలో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని తెలిపాడు. తాను బెంచీ మధ్యలోకి జరగగానే అతను వెళ్లిపోయాడని భావించి ఆన్సర్‌షీట్ మార్జిన్ కొట్టుకుంటుండగా ప్రశ్నపత్రం లాక్కున్నాడని, ఫొటోలు తీసుకుని ఆ ప్రశ్నపత్రాన్ని తన వైపు విసిరేసి వెళ్లిపోయాడని పేర్కొన్నాడు. తనను చంపుతానని బెదిరించడంతో భయపడి ఆ విషయం ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. చేయని తప్పుకు తన భవిష్యత్‌ను బలి చేయకుండా హాల్‌టికెట్ ఇచ్చి యథావిధిగా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. కనీసం సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశమైనా ఇవ్వాలని ఉన్నతాధికారులను వేడుకున్నాడు. హరీశ్ తల్లి లలిత మాట్లాడుతూ తన కొడుకు భవిష్యత్‌ను పాడు చేయకుండా పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని రోదిస్తూ చేతులు జోడించి సంబంధిత అధికారులను వేడుకొంది.

సపోర్ట్ ఇంజనీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



ఖమ్మం వైద్యవిభాగం: నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఖమ్మం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఐదు సపోర్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ మాలతి తెలిపారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల ఈహెచ్ఎంఐఎస్ నివేదికలను వీరు పర్యవేక్షించాలని ఉంటుందని పేర్కొన్నారు. బీటెక్, ఎంబీఏ అర్హత కలిగి నాలుగేళ్ల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని, కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీ ద్వారా నియామకాలు చేపడుతామని తెలిపారు. అభ్యర్థులు జిల్లా వెబ్‌సైట్ ద్వారా కానీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నేరుగా కానీ ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు అందజేయాలని సూచించారు.

పీఎం ఫెలోషిప్ అవార్డుకు మోటాపురం విద్యార్థిని



బిక్కసాని మైత్రి

నేలకొండపల్లి: ఉన్నత విద్యారంగంలో పరిశోధనలకు అందించే ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి ఫెలోషిప్ అవార్డుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని మోటాపురం విద్యార్థిని అర్హత సాధించింది. ఈఏడాది దేశవ్యాప్తంగా 23 మందిని ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల్లోమోటాపురానికి చెందిన బిక్కసాని మైత్రికి అవకాశం దక్కింది. లూథియానాలోని పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థలో ఏడాది పాటు పరిశోధన చేసిన ఆమె పశుగ్రాసంగా సాగు చేసే మొక్కజొన్నలో మేలైన వంగడాల రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ప్రధానమంత్రి ఫెలోషిప్ ద్వారా ఆమెకు నాలుగు ఏళ్ల పాటు స్కాలర్‌షిప్ అందనుంది.

సింగరేణి విజిలెన్స్ జీఎంగా ప్రసాద్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కార్పొరేట్ విజిలెన్స్ జనరల్ మేనేజర్‌గా కె.ప్రసాద్ రావు నియమితులయ్యారు. ఆప్మెయిల్ జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను విజిలెన్స్ జీఎంగా నియమిస్తూ జీఎం పర్సనల్(ఈఈ సెల్) జీఎం ఏ.కుమార్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విజిలెన్స్ జీఎంగా పనిచేసిన పిచ్చయ్యశాస్త్రి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడంతో ప్రసాద్‌రావును నియమించారు. అలాగే, ఎన్టీపీసీ జీఎం రాజశేఖర్‌ను ఆప్మెయిల్ జీఎంగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

ఎర్ర బంగారం కళకళ

- ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి
- 53,284 బస్తాలను తీసుకొచ్చిన రైతులు
- వరుస సెలవులు వస్తుండడంతో బారులుదీరిన వైనం



ఖమ్మం మార్కెట్ యార్డులు నిండిపోగా బయట వేసిన మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డు ఎర్రబంగారం(మిర్చి బస్తాల)తో నిండిపోయింది. యార్డులో ఎక్కడ చూసినా మిర్చి బస్తాలే కనిపించగా.. షెడ్లు సరిపోక ఆవరణలోనూ బస్తాలు వేశారు. మిర్చికి మెరుగైన ధర పలుకుతుండడానికి తోడు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు ఉండడంతో రైతులు పంట విక్రయానికి మొగ్గు చూపారు. ఈమేరకు గురువారం అధికారిక లెక్కల ప్రచారం 53,284 బస్తాల మిర్చిని రైతులు తీసుకురాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ. 23,800, మోడల్ ధర రూ.21 వేలు, కనిష్ఠ ధర రూ.17వేలుగా పలికింది. కాగా, బుధవారం క్వింటాకు రూ.23,900 గరిష్ఠ ధర పలకగా 40,619 బస్తాలే విక్రయానికి తీసుకున్నారు. ఈమేరకు బుధవారంతో పోలిస్తే ధర రూ.100 తగ్గింది. ఇక తాలు మిర్చి ధర కూడా అడుగు ముందకేసింది. తాలు మిర్చి గరిష్ఠంగా ధర రూ.15 వేలు పలకడంతో చరిత్ర సృష్టించినట్లయింది.

ఫిబ్రవరి తరహాలో..

మార్కెట్‌కు ఫిబ్రవరి రెండు, మూడో వారాల్లో అధిక మొత్తంలో మిర్చి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 13న అత్యధికంగా 60,132 బస్తాల మిర్చి రాగా.. అప్పట్లో క్వింటాకు రూ.18,150 మాత్రమే ధర పలికింది. గత నెల ఆరంభం నుంచి ధర పుంజుకోవడంతో నిత్యం 40 వేల బస్తాల మేరకు విక్రయానికి తీసుకొచ్చేవారు. కానీ గురువారం అనూహ్యంగా 53వేలకు పైగా బస్తాల మిర్చిని రైతులు తీసుకురావడం విశేషం. ఇటీవల వర్షాలతో కోతలు నిలిపేసిన రైతులు మళ్లీ మొదలుపెట్టగా, అమ్మకానికి మొగ్గు చూపుతున్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ-గోపయ్య స్వామి కల్యాణం

వైరారూరల్: వైరా మండలం దాచాపురం, గన్నవరం కూడలిలో గురువారం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ -గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటుచేశారు. కాగా, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్ల బండ లాగుడు పోటీలను ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ ప్రారంభించారు. ఈపోటీలు శుక్రవారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా మహిళలకు తాడు లాగు పోటీలు, పురుషులకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై వీరప్రసాద్

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

ఇన్‌చార్జ్ డీపీఓ కేలోతు ధన్‌సింగ్



శిక్షణలో పాల్గొన్న వారితో డీపీఓ, అధికారులు

మరిపెడ రూరల్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీపీఓ కేలోతు ధన్‌సింగ్ సూచించారు. మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్-2లో భాగంగా మూడు రోజులుగా ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణపై ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలకు ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయడానికి స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో అన్ని గ్రామాలు ఓడీఎఫ్‌గా ప్రకటించబడ్డాయని పేర్కొన్నారు. అనంతరం గిరిపురంలో చేపట్టిన సర్వేలో ఎంపికైన ఇంటి యజమానులు, సర్పంచ్ పెద్దబోయిన జనార్దన్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో స్వచ్ఛ భారత్ జిల్లా కోర్డినేటర్లు శ్రవణ్, రవికుమార్, ఎంపీఓలు పూర్ణచందర్‌రెడ్డి, హరిప్రసాద్, ఏపీఎం రాములు, కార్యదర్శులు రామకృష్ణ, లెనిన్, విక్రమం, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్



గేటుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

కారేపల్లి: సాంకేతిక లోపంతో గురువారం కారేపల్లి మండలం గాంధీపురం రైల్వేస్టేషన్ వద్ద రైల్వే గేట్‌పై గురువారం గూడ్స్ నిలిచిపోయింది. డోర్నకల్-భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) మార్గంలోని ఇల్లెందు -ఖమ్మం ప్రధాన రహదారి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో సుమారు గంటపాటు గేట్ తీయలేకపోగా, ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

కేంద్ర వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడదాం..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

చుంచుపల్లి: ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరి, వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టడమే కాక వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. చుంచుపల్లిలో గురువారం జరిగిన కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకాశాన్నంటుతున్న ధరలతో సామాన్యుడి బతుకు భారంగా మారాయని తెలిపారు. ధరలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధర కూడా కల్పించలేకపోతోందని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ, ప్రభుత్వరంగ సంస్థల భద్రత హామీలను విస్మరించారని మండిపడ్డారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా మాట్లాడుతూ బీజేపీ కో హఠావ్.. దేశ్ కో బచావ్ నినాదంతో జిల్లాలో చేపట్టనున్న ఇంటింటికీ సీపీఐ, ప్రజా పోరు యాత్ర ఈనెల 14 నుంచి చర్లలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, దుర్గరాసి వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, వట్టికొండ మల్లికార్జున్ రావు, కంచర్ల జమలయ్య, జి.వీరస్వామి, కందుల భాస్కర్, బానోత్ గోవిందు, కె.రత్నకుమారి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

కల్లూరు: కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవక్షేత్రం(శివాలయం) ఆవరణలో నాలుగు జిల్లాల స్థాయి ఫొటో, వీడియోగ్రాఫర్ల క్రికెట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, జిల్లాల స్థాయి పోటీలను జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ప్రశాంతతో పాటు శరీర దారుఢ్యానికి దోహదపడుతాయని తెలిపారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కే.హుస్సేన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవర నాగరాజు, మద్రైల నాగేశ్వరరావుతోపాటు పసుమర్తి చందర్ రావు, డాక్టర్ లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణ రావు, వేముల నర్సింహారావు, చల్లా వెంకటేశ్వర రావు, వేణు, డేవిడ్, వి.తిరుమలరావు, ఎం.డీ.హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

68 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 68మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యారు. ఈ మేరకు లబ్ధిదారులకు రూ.31,58,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు అందజేసి మాట్లాడారు. జిల్లా టెలికాం సలహా మండలి(టీఏసీ) సభ్యుడు చిత్తారు సింహాద్రి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పోట్ల శ్రీను, చెరుకుమల్లి రవి, నారపోగు వెంకటేశ్వరరావు, చింతలచెర్వు లక్ష్మి, గుగులోత్ కృష్ణ, ఉపేందర్, బంధం నాగేశ్వరరావు, భాగం వెంకటేశ్వరరావు, కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, తాళ్లూరి హరీష్, పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్, బొర్రా నర్సింహారావు పాల్గొన్నారు.